కీ॥ శే॥ పూడిపెద్ది
వెంకటరమణయ్య

# ★ ఎవరి కెవరూ? —

క్రచేరీనుండి ఇంటికి వచ్చేడు.

శివుడు తాండవించే చిరుచీకటి సందెవేళ— అంతటా ప్రాకే చీకటి తీగలతోపాటు నిద్దుర తీగలు సాగిస్తూండా గుమ్మం. ముత్యంలేని ముసలి ముత్తయిదువు ముక్కెరలాగు వ్రేలుతూంది కప్పు తాళ మొకటి గొళ్లెంలో-దిస్సవడింది. దీనంగా కనబడుతూంది.

జేబు తడుముకున్నాడు. సాలోచనగా నొసటి చెమట ఊడ్చేడు. రెండవజేబు తడిమేడు- చేతి క్రింది కాగితాల కట్ట నేలను పెట్టి మడిమలెత్తి చేతులెత్తి తాళం త్రిప్పేడు- నిట్టూర్చేడు. వంగి నేలనున్న కాగితాలకట్ట తీసి లేచేడు.

వాని మొగ మెఱ్ఱగా కందగడ్డలాగుంది. కంది పోయింది. సందె పూచింది. అతిభారంగా తలుపు తెరచేడు.

అంతకుముం దెన్నిసారులో ప్రవేశించిన ఆ యిల్లే వానికి వింతగా కనబడింది. గాలితో ఏదో బరువు వానిని వరసరాల దిగలాగుతూంది. బరువెక్కిన చీకటి వాని గుండెకు గుండుకట్టి లాగుతూంది. కోపపడడు. శౌర్యపడడు. కోపపడలేకుండా ఉన్నాడు. ఏమిటో చెప్పలేని యాతన పాలవుతూ ఇంట్లో ప్రవేశించేడు.

చీడీలో అనవాలుగా వున్న వాలుడు కుర్చీలో కూలబడ్డాడు. ధూళి దులిపేడా? దుస్తులు మార్చేడా? కాగితాలకట్ట కాళ్ళకడ పడేసి, పాగా నేలను పడేసి, కన్నులుమూసికొని నిట్టూర్చేడు. అలాగు చిన్నమాగన్ను పెట్టుకున్నాడు.

నిద్రలా వచ్చింది. ఏ మూలనో కీచురాయి గీపెడుతూంది వాని నిద్ర కది శ్రుతిపెడుతూంది. నిద్రేమిటి- చిన్న తెర- బాహ్యాన్ని విస్మరించడానికి ప్రయత్నం- మరపు- మమత. అందులోనే చిన్న విశ్రాంతి అదేమిటో ఏదో అవస్థ. ఒకటి రెండు మినిట్లో, అయిదారు మినిట్లో అయింది. అలాగే యుగాలు గడచిపోతే బాగుండును అని వాని యూహ కావచ్చు.

ఏదో అడుగుల చడి- గిలుకు గిలుకు గజ్జల మ్రోతా- ఆ చీకటివేళ మిడుతలే త్రుళ్లుతున్నవో కీచురాళ్ళే గిలుకు గిలుకుమని అరుస్తున్నవో. క్రొత్తవాడయితే త్రుళ్ళిపడి చూస్తాడు నలువంకలా. శంకర్రావలా పడుక్కునే ఉన్నాడు. చప్పుడు విన్నాడు కాని కదలలేదు కన్ను విప్పలేదు

లీలగా నీడబొమ్మలాగు లీల యింట్లో ప్రవేశించింది వెన్నుమీదినుండి వ్రేలాడుతూన్న పైట చెర గడమచేత ముందుకూ వెనుకకు ఊస్తూ, కుడి చేత జడ సిగ సవరించి పూలు తడిమికొంటూ

"కమలా మనోహరా!
గడియయైన నాతో
పడుక సేయవేర?
కమలా మనోహరా"

అని పిల్ల రొలుగున పాడుతూ చల్లగా సాగి నడుస్తూండా మునుచీకటి యింట్లో.

శంకర్రావా చడి వినేఉంటాడు. కాని కదలలేదు.

ఆమె వానిని క్రీగంట చూచింది. నిర్లక్ష్యంగా అడుగులు పెట్టి వానిని దాటి పడకగదిలో ప్రవేశించింది.

ఇంతలో చప్పున దీపంవెలుగు నిండిందా గదిలో.

సోగ శరీరం. తీయని గుండ్రని ముఖం. తీర్చినట్టు చేడీకలలాటి కళ్లు, నున్నని చెక్కిళ్లు, లాలించే చూపు. లీల ఏమిటో సందడిగా పెట్టెలు తెరచి తిరుగవేస్తూంది. దబ్బాలు మూతలు తీసి వేస్తూంది. ఎంతో సందడిస్తూంది.

తెలిసే ఉన్నాడు శంకర్రావు లేచి కూర్చొని వంగి పడకగదిలోకి చూడదలచినా చూడలేడు. నిస్సహాయుడుగా అలాగు కన్నులు మూసుకునే పడుక్కున్నాడు. చించుకున్నట్టుంది వాని హృదయం. జంకుగా మెల్లగా కను లరవిచ్చి ఆ గది వైపు చూచేడు.

చీకటిని చీల్చుకొని వస్తూన్న వెలుగు వెల్లువ మాత్రం వానికి కనబడింది. ఆ వెలుగు చీకటిగా మారిపోతే బాగుండుననుకున్నాడు. ఎందుకూ! ఏదైనా మందు తూడితో శరీరనాళాలలోకి వేసి మతి పోగొట్టుకుంటే బాగుండుననుకున్నాడు. ఎంచేతోగాని వానికి బాహ్యజ్ఞానం ఏమీ కిట్ట లేదు.

అత్తరు వాసనలు బుగులుకొంటున్నాయి. మిరపకాయల ఘాటులోవలె వాని ఊపిరాడడంలేదు. చీర మడతల రాపిడి సడి వినబడ్డాది. వాని శరీరం సెన్నును వేసి నూరినట్టయింది. గదిలోని దీపపు వెలుగు వెల్లువ విపులమై చీడీలపైకి ప్రాకుతూంది. వాని హృదయం పిల్లిబడి యెరిగిన యెలుకవలె ఒదిగి యొదిగి వీకవీకలబోతూంది.

సగ మల్లిన జడకొసను జల్లుగా విడ్డ తలవెంట్రుకల కుచ్చు, దాని తల నమర్చిన రిబ్బను ముడి, తల నంటే అంటుక వ్రేలియాడే పూలదండ ముంగురుల ఎగజోపు మడతలలో సగము విడ్డ గులాబి, చెవుల పెద్ద లోలక్కులు, జేవురురంగు చెక్కులు, చెందిరపు పెదవులు, చేతి కొలుకుల కాటుక రేఖల కనులు, ఊదారంగు తిలకం, జాలుచేతుల రవిక, ముద్రించి కట్టిన పూవుల సన్న చీర, చీర కట్టులోనుండి లోపలి [illegible] కనపడుతూంది. కాలికి [illegible] స్లిప్పర్లు. లీల ఒయ్యారంగా గది యివాలకు వచ్చింది.

అరమోడ్పుతో అనిష్టంగా చూచాడామెవైపు శంకర్రావు. డాన్సింగు డ్రస్సు పడే మిక్సెడ్ క్లబ్బునలంకరిస్తుంది కాబోలు రాత్రి ఏ రెండు గంటలకో తిరిగి ఇంటికివస్తుందో లేదా మానేస్తుంది. ఎవడెరుగ గలవాడు.

"లీలా!" శబ్దించని పిలుపు ప్రయత్నం ఆ పెదవులలో ఆగిపోయింది. చప్పున కన్నులు మూసికొన్నాడు శంకర్రావు.

లీల వెలుగులో నిలచి చీకటిలోనున్న భర్త ముఖం క్రీగంట చూచింది. చిటుకు బొటుకు స్లిప్పర్లు చప్పుడు చేసుకుంటూ మెట్లుదిగి వీధిలోకి వెడలిపోయింది.

లేచేడు దిగ్గున. ఇంటి వెలుగెత్తి వెళ్ళింది లీల. గదిలోకి వెళ్ళేడు శంకర్రావు. ఆగినట్టుంది గది. అన్ని సామానులూ అక్రమంగా చలువపోయి ఉన్నాయి. కాగితాలకట్ట గదిలో పడేసి నిలువుటద్దాని కెదురుగా నిలబడ్డాడు. అనుకోకుండా— నీడ చూచుకున్నాడు. జాలిపడ్డాడు. విచారించేడు తలపంకించేడు. 'లేద'ని నిరాశతో శరీరం ఒసిలించేడు. ఇసుర్రని మంచంమీద పడుకొన్నాడు. ఏదిచూచినా తనకోసం అనాకంప ప్రదర్శిస్తూన్నట్టుంది. ఏ చప్పుడూ తనకొరకే రోదిస్తూన్నట్టుంది. ఏక్షణం తనకొరకే వెడలలేక వెడలలేక వెడలుతూన్నట్టుంది. మనసు లాగుతూంది. నిద్రరాదు. మరపు రాదు, వ్యాపృతి ఇంకొకటి లేదు

దినమంతా ప్రయాసపడి అధికారుల సన్నిధానాన చేతులు నులుముకొని మూతి బిగించికొని దైన్యం ప్రకటించి, ఔదార్యాన్ని పౌరద్రోహి పతులుపైతం గూర్పు చేసేవేళ, గృహం కూడు చేరుకున్నాడు.

శంకర్రావు భూవసతి గలవాడు, స్వగృహం ఉంది. అంతో ఇంతో ఆంగ్ల విద్యాగంధం గలవాడు.

ఆక్కడెక్కడో ఆనాడెప్పుడో ఏదో చదివేడు ప్రేమగూర్చి. ఆ నిర్వచనం అనిర్వచనీయమై, అవాఙ్మానసగోచరమై, అందరానిదై, ఆదర్శాని కాదర్శమై ఏదో వచించింది. వానికది ఇంకొకలాగు హృదయగోచరమయింది. వేరొక తెన్నున భావరూపం దాల్చింది

ఆ వేళ రాత్రి వాని ప్రేమ ఉమ్మిరిగా ఉక్కిరిబిక్కిరిగా వానిలో బుడబుడలాగు వెలుగుతూన్నప్పుడు లీలను బుజగించి, బురిడించి, లాలించి చేదీసి చెక్కులనొక్కి ఆ సందడిలో ఏవో వాక్యాలన్నాడు ఆమెతో: 'లీలా! నిన్ను స్వేచ్ఛారాజ్యానికి పట్టంకట్టని రాణిగా చేసేను నీ యిష్టంవచ్చినట్టూ సంచరించు, నీ యిష్టంవచ్చినట్టూ ప్రేమించు" పలుకన్నాడో ఏమిటో, అప్పటాతని హృదయం అంత విశాలంగా విరిసింది.

లీల ఒద్దదీసిన కత్తి, బాల్యం విడివడని యౌవనాంకురావస్థ, బొమ్మ పిల్లలతో ఆడుకొనే వయసు, బొట్టిలతో నేసంగటి విడిచి నంభాలాటాడే చాంచల్యం. ఆమెకేం తెలుస్తుంది! ఆ ఆటలు మరిగింది.

మప్పేడు శంకర్రావు త్రిప్పడమెలాగు.

పడుకొక్కలేకపోయాడా మంచంమీద. దిగ్గన లేచేడు తల భారంగా వంచికొన్నాడు. ఆ నీడలో కన్నీళ్ళు జారేయేమో.

పెదవి తడసికొంటూ మంచం దిగి బట్టలు తగిలించిన కొయ్యదగ్గరకు వెళ్ళేడు. జామారు ఖండవా భుజాన వేసికొన్నాడు. చొక్కా—

పంచా, కాళ్ళ కాడుచెప్పులు సాహసంగా బయటేశాడు. వీధిగుమ్మం తలుపువేసి గొళ్ళెం పెట్టి అందులో తాళం తగిలించి త్రిప్పేడు. వీధి ముఖమై ఇంటి మెట్లమీద నిలచేడు. అటూయిటూ ఉభయముఖాలా వీధి పరిశీలించేడు వెడలిపోయాడు జనసామాన్యంలో కలిసిపోయాడు.

## ౨

అగ్నిగుండాలు-ఆహుతే యోగాగ్ని నిరశన వ్రతం సాగిస్తున్నాడక్కడి హవ్యవాహనుడు, యోగదండాలు గంజాయి నిద్రలేగాని యోగనిద్రా సమాధుల సంపర్కం ఎరుగవు.

వాళ్ళు జడలు గట్టిన కురులతో, పెరిగిన గడ్డాలతో, ఎఱ్ఱని కళ్ళతో, కషాయపు గోచీలతో ఒడలినిండ బూడితో సందడిస్తున్నారు. బైరాగులు, గోసాయీలు, సన్యాసులు, ఎవళ్లో పేరేమిటి? జ్ఞానమా, అనుభవమా?

వాళ్ళలో గడ్డాలుగాని, జడకట్టుగాని లేక లేత లేత దీనముఖంతో దిగులుగా గోడకు చేరబడి కునుకుతూ త్రుళ్ళిపడి కళ్ళు తెరుస్తూ కూర్చున్నాడు సగం, పడుకున్నాడా సగం, శంకరయోగి జేగురురంగు బాహుపుగుడ్డ కాసె బిగించి.

జై సీతారామ్ బొం! బొం! బొం! హరి రామ్! అలాటి తెలుగో హిందీయో తెలియని ముక్కల కలగలపుతో నిండిన బైరాగి సత్రం అది. గోసాయీలు వస్తున్నారు పోతున్నారు.

పొద్దు వాలుతూంది. ఆ ఆవరణలో రావిచెట్టు క్రింద 'ధునియా' పొగ లేగస్తూంది. దాని చుట్టూ చేరేరు గోసాయీలు. వారి చేతులలో చుట్టపిల్లలాగు గుడగుడుపులో తిరుగుతూంది. ఎఱ్ఱని ముఖంతో చిలుంగొట్టాం పీలుస్తున్నారు. త్రేలుతున్నారు బహుముఖాల.

శంకర్రావా నడుమున్నాడేమో! ఆధూమం సేవిస్తున్నాడేమో.

చీకటి పడిపోయింది.

మిడుగుల వెలుగులో పోలికలు తెలీవు.

... ... ...

ఆనాడు తెల్లవారుజామవుతూంది. గుడ్డి గుడ్డివెన్నెల రస్తామీద, ప్రక్కయిండ్ల నీడలలో అక్కడక్కడ మనుష్యసంచారం ఉంది.

సగము వెలుగులోకి, సగం నీడలోకి నిలబడాడు చెడ్డీ, చెప్పులు, లాల్చీ తలపాగా పోలీసు ఉద్యోగి. చేత లాఠీ పుచ్చుకొని నిలబడ్డాడు. వాని కాళ్ళదగ్గర ఏదో మూటగా నేలను పడివుంది, చోరీ ఆస్తో, మరేమో! అప్పుడే సందడవుతూంది అక్కడా అక్కడాను. పోలీసు ఉద్యోగి నేల నిదానించి చూచి 'విషిల్' వేసేడు. ఇద్దరు ముగ్గురు పోలీసు ఉద్యోగులు చేరేరు.

'గుఱ్ఱ మెక్కడోయ్' అన్నాడు ఒకడు.

'సమూం విరిగింది' అన్నాడు మరొకడు.

'హాస్పత్రికి తీసుకొని వెళితే బాగుండున' న్నాడు ఇంకొకడు.

మెల్ల మెల్లగా పదిమందిదాకా చేరేరాచోటున.

జాలిగా ముడుచుకొనిపోయి మూటకట్టుకొనిపోయి, ఒడలంతా రొడ్డు బుగ్గితో నిండిపోయి, కట్టుకున్న కాషాయపుయిజారా ఎఱ్ఱగనుంటా పడిఉన్న ఆ వ్యక్తిని టార్చిలైటుతో పరిశీలించేడొకడు. వాని ముఖంమీదికి వంగి పసిపట్టి పసిపట్టి "ఆఁ! మరేమీ లేదయ్యా! వీడొక త్రాగు



Selling Agents M/s BEST & CO., LTD.
P. O. Box. 63 Madras 1.




కేసరికుటీరం, లిమిటెడ్.,

మద్రాసు. 14.

ఒరిస్సా. నైజాము డొమినియన్లు. ఆంధ్రజిల్లాలు.

తమిళనాడులకు ఏజెంట్లు :—

సీతారామా జనరల్ స్టోర్సు.

బరంపురం-సికంద్రాబాదు-బెజవాడ-మధుర.


పోతు; డోసు లావయింది. దొర్లుతున్నాడు" అన్నాడు.

ముఖమానవాలు పట్టడానికి మూడు నాలుగు సార్లు టార్చిలైటు వేసి అందరూ ఆ ముఖమే చూచేరు.

అక్కడో బండీ ఆగింది. అందరి దృష్టులూ ఆ బండీవేపు మరలేయి. ఆ బండిలాంతరు వెలుగులో ఎవరో స్త్రీ వ్యక్తి కూర్చుంది. చేతి రిస్టువాచీ పరిశీలించి 'టైమ్-టైమ్' అంది ఆమె. జట్కావాడా గుంపులో పడిఉన్న వ్యక్తివైపు చూస్తూ "ఎవరు, ఎవరు?" అని అడిగేడు ఆత్రంగా.

'ఎందుకు నిలబెట్టేవు బండీ? ఇంకా చాలా దూరం పోవాలిగదా! టైమ్! టైమ్!' అంది.

ఆ గుంపులోనుండి ఎవడో ఏదో అన్నాడు గాని ఆ మాటలామెకుగాని ఆ జట్కావానికి గాని వినబడలేదు.

"ఏమిటీ?" అన్నాడు జట్కావాడు.

"ఏమయితే మనకేం? జట్కా పోనీ" అంది. ఆమె బండిలోనుండే.

జట్కావానికిమాత్రం ఆ సందడేమిటో కనుక్కుందామన్న కుతూహలం వచ్చింది. జట్కా దిగి ఆ గుంపును సమీపించేడు. అక్కడ పడి ఉన్న వ్యక్తిని చూచేడు. 'ఎవరీయన?' అని అందరిలోనూ ప్రశ్నించేడు. అందులో ఎవరో ఏదో పేరు చెప్పేరు.

"రాత్రోయ్ టైమయిపోతూంది" అని జట్కాలోనుండి ఆమె కేకపెట్టింది, జట్కా [illegible] ఎక్కుతూ.

"ఎవరైతే నేటి ఇప్పుడు చేసనోళ్ళే అలాగ వుంటున్నారు. గమ్మోడికంటే గరిటె ఎక్కువ తాగినాడమ్మా. ఆ దురదృష్టగస్తుడెంటూ డాను." జట్కాతోలూ ఆ మాటలన్నాడు. ఆమె పరాకుగా ఆ మాటలాలకించీ ఆలకించనట్టు ఊరకుంది.

'శంకర్రావుట ఆయనపేరు. తప్పతాగి పడిపోనాడమ్మా రోడ్డుమీద. ఒంటిమీద గుడ్డైనా తెలియకుండా దొర్లుతున్నాడు.'

'పోనీమనకేం-జట్కా వేగంగా తోలు' అంటూ అల్లంత దూరమయిపోయిన గుంపువైపు చూస్తూ వెళిపోతూంది జట్కాతోకూడా లీల.

ప్రేమస్వేచ్ఛగా అనుభవించే ప్రియురాలు. ఎవరి కెవరు?